# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-10-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రక్షణ రంగ బలోపేతానికి ప్రభుత్వం ప్రాధ్యానతనిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.**
2. **రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులు పెట్టేందుకు అనుకూల వాతావరణాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కల్పించిందని ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.**
3. **జీఎస్టీ సంస్కరణల ద్వారా స్వదేశీ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు మరింత మెరుగు పడతాయని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు.**
4. **దీపావళి పండుగ సందర్భంగా తిరుమలలో దీపావళి ఆస్థానాన్ని ఈ రోజు శాస్త్రోక్తంగా నిర్వహించారు.**

==========================

రక్షణ రంగ బలోపేతానికి ప్రభుత్వం ప్రాధ్యానతనిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. గోవా తీరంలోని నౌకాదళ సిబ్బందితో ఈ రోజు నిర్వహించిన దీపావళి వేడుకల్లో ప్రధానమంత్రి పాల్గొన్నారు. గోవా, కర్వార్ తీరంలోని స్వదేశీ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌ను సందర్శించిన ప్రధానమంత్రి అక్కడ పనిచేస్తున్న నౌకాదళ సిబ్బందితో ముచ్చటించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ, ఐఎన్ఎస్ విక్రాంత్ ఆత్మనిర్భర్ భారత్, మేడ్ ఇన్ ఇండియాకు ప్రతీకగా నిలిచిందన్నారు. గత పదకొండేళ్లలో రక్షణ రంగంలో ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ 24సెకన్లు

-------------------------

రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులు పెట్టేందుకు అనుకూల వాతావరణాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కల్పించిందని ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఆస్ట్రేలియాలో రెండో రోజు పర్యటనలో భాగంగా హెచ్ఎస్ బీసీ బ్యాంక్ సీఈవో ఆంటోనీ షా నేతృత్వంలో సీనియర్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ బృందంతో మంత్రి ఈ రోజు సిడ్నీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... పెట్టుబడిదారులకు ఊతమిచ్చేలా పారిశ్రామిక విధానాలను అమలుచేస్తున్నామని చెప్పారు. ఈ విధానాల ద్వారా 16 నెలల్లోనే రాష్ట్రానికి 10లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. రాష్ట్రంలో సువిశాల తీరప్రాంతంతో పాటు రహదారులు,

మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

---------------------------

వస్తు సేవల పన్ను-జీఎస్టీ సంస్కరణల ద్వారా స్వదేశీ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు మరింత మెరుగు పడతాయని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు.'సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్' కార్యక్రమంలో భాగంగా నూజివీడులో నిర్వహించిన బైక్ ర్యాలిలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ స్లాబులను గణనీయంగా తగ్గించిందన్నారు. జీఎస్టీ ప్రయోజనాలు ప్రతీ కుటుంబానికి తెలియజేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

---------------------------

ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమమే ప్రాధాన్యతగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలుపుతూ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపిందని అన్నారు. దీపావళి సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులకు, ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకుందని, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లను, పదోన్నతులు ఇచ్చినట్లు మంత్రి వివరించారు.

---------------------------

దేశవ్యాప్తంగా దీపావళి సందర్భంగా నిర్వహించే బాణాసంచా వేడుకలు మరికొద్ది గంటల్లో ప్రారంభంకానున్నాయి.ఈ సందర్భంగా బాణాసంచా కాల్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

వాయిస్ 32 సెకన్లు

---------------------------

వైద్య సహాయం అవసరమైన నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఉపయోగపడుతుందని చీరాల శాసనసభ్యులు ఎం. కొండయ్య అన్నారు. బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గంలో ఆర్థిక సహాయం అవసరమైన 62 మంది లబ్ధిదారులకు మంజూరైన 55 లక్షల రూపాయల నగదు చెక్కులను ఆయన ఈ రోజు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ, పేదప్రజల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు.

---------------------------

వస్తు సేవల పన్ను-జీఎస్టీ తగ్గింపులతో వివిధ రకాల వస్తువుల ధరలు అందుబాటులోకి వచ్చాయని ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తెలిపారు."సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్" కార్యక్రమంలో భాగంగా ఒంగోలులోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిన్న నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ,

వాయిస్19 సెకన్లు

---------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో దీపావళి పండుగ సందర్భంగా దీపావళి ఆస్థానాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం – టీటీడీ ఈ రోజు శాస్త్రోక్తంగా నిర్వహించింది. ఆస్థానంలో భాగంగా శ్రీమలయప్పస్వామి దేవేరులతో కలిసి ఘంటా మండపంలో ఏర్పాటుచేసిన సర్వభూపాల వాహనంలో గరుడాళ్వార్‌కు అభిముఖంగా వేంచేపు చేశారు. అలాగే సేనాధిపతి అయిన శ్రీ విష్వక్సేనులవారిని కూడా మరొక పీఠంపై వేంచేపు చేశారు. ఆ తరువాత స్వామివారికి ప్రత్యేక పూజ, హారతి, ప్రసాద నివేదనలను అర్చకులు ఆగమోక్తంగా నిర్వహించారు. దీపావళి ఆస్థానం సందర్భంగా కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసింది.

---------------------------

ఎముకల పటిష్టతపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈ రోజు ప్రపంచ బోలు ఎముకల వ్యాధి .... ఆస్టియోపోరోసిస్.... అవగాహనా దినం పాటిస్తున్నారు. ఎముకలు దృఢత్వం కోల్పోయి గుల్లగా..., బలహీనంగా మారడాన్ని బోలు ఎముకల వ్యాధి అంటారు. ఈ వ్యాధి వున్న వారు పొరబాటున కింద పడితే ఎముకలు విరిగే అవకాశం ఉంటుంది. ఈ వ్యాధి లక్షణాలు ..., తీసుకోవలసిన జాగ్రత్తలు ...., చికిత్స వంటి అంశాలను ప్రచారం చేయడానికి బోలు ఎముకల వ్యాధి అవగాహనా దినం పాటిస్తున్నారు. వయసు సంబంధిత మార్పుల వల్ల లేదా కొన్ని ప్రత్యేక ఆరోగ్య పరిస్థితులు ...., మందుల వల్ల ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుంది. పురుషుల కంటే మహిళలలో ఈ వ్యాధి సంభవించే అవకాశాలు ఎక్కువ.

సాధారణ వ్యాయామం ...., విటమిన్లతో కూడిన ముఖ్యంగా కాల్షియం ..., విటమిన్ డి లతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా బోలు ఎముకల వ్యాధి రాకుండా జాగ్రత్త పడవచ్చు.

---------------------------

ఈ నెల 22 వ తేదీ నుంచి కార్తీక మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో గోదావరి నదిలో స్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని రాజమహేంద్రవరం మున్సినల్ కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలోని పుష్కర ఘాట్ లో సీసీ కెమెరాలు, స్నానపు గదులు, లాకర్లు వంటి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కార్తీక మాసంలో భక్తుల రద్దీకి తగినట్లు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. నదిలో హెచ్చరిక బోర్డులతో పాటు గజఈతగాళ్ళు, పడవలను సరిపడా అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఘాట్ వెంబడి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

---------------------------

దక్షిణ మధ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో రానున్న నాలుగు రోజులలో వాయుగుండం ఏర్పడే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రస్తుతం ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, ఇది రేపటికి అల్పపీడనంగా బలపడి, ఆ తర్వాత వాయుగుండంగా మారే అవకాశం ఉందని పేర్కొంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్ నారాయణ తెలియజేస్తూ,

వాయిస్ 27 సెకన్లు

=====================